కామెడీ కథ

**"అహ నా క్రెడిట్ కార్డంట... ఒహ నా బ్యాంక్ లోనంట... ఠాం ఠాం ఠాం.." మెంటల్ బ్యాలెన్స్ తప్పిన క్యాండిడేట్‌లా పిచ్చిగంతులు వేస్తున్నాడు పినాకిరావు.**

# దట్సాలంతే!

"హ్హా..హ్హా..హ్హా.. హ్హి..హ్హి.. హ్హి.. హ్హో..హ్హో..హ్హో" అంటూ నవ్వాడు.

"హ.. గుణింతం చాలుగానీ అసలు విషయం చెప్పండి" అంది అతని పెళ్లాం.

"చెప్పను.. సస్పెన్స్. కళ్లు మూసుకో" అన్నాడు పినాకిరావు.

మొగుడి వంక కోపంగా చూసి కళ్లు మూసుకుంది.

"వీరి వీరి క్రెడిట్ కార్డు.. దీని పేరేమిటి?" అంటూ ఓ క్రెడిట్ కార్డు పెళ్లాం కళ్ల ముందుంచాడు.

"అదేదో బ్యాంకు క్రెడిట్ కార్డు" అంది సంతోషంగా.

"మళ్లీ కళ్లు మూసుకో.." అన్నాడు పినాకిరావు.

మళ్లీ కళ్లు మూసుకున్నాక- "వీరి వీరి క్రెడిట్ కార్డు.. దీని పేరేమిటి?" అన్నాడు.

మళ్లీ కళ్లు తెరచి చూసి "అరె.. 'ఇదేదో' బ్యాంకు క్రెడిట్ కార్డు"

"మళ్లీ మూసుకో కళ్లు" పినాకిరావు అన్నాడు.

మొగుడి వంక చూసి "మాడు పగులుద్ది. మూసుకున్న కాడికి చాలుగానీ మొత్తం ఎన్ని క్రెడిట్ కార్డులు తీసుకున్నారేమిటి?" అంది కళ్లు టపటపలాడిస్తూ.

అయిదే చేతివ్రేళ్లను చూపిస్తూ "నాలుగు" అన్నాడు మూడు క్రెడిట్ కార్డులు చూపిస్తూ.

"మీకు లెక్కలు చెప్పిన మాస్టర్‌ని అనాలి" అని మూడు క్రెడిట్‌కార్డుల వంక మురిపెంగా చూసి ప్చ్.. ప్చ్.. ప్చ్... అంటూ వాటిని ముద్దెట్టుకుంది.

"ఆగాగు.. దేవుడి దగ్గర పెట్టి పూజ చేయాలి" అన్నాడు పినాకిరావు.

మిసెస్ పినాకిరావు వాటిని దేవుడి ముందు పెట్టి క్రెడిట్ కార్డులకు బొట్లు పెట్టి హారతిచ్చి, కొబ్బరికాయ కొట్టి తతంగమంతా పూర్తి చేసింది.

అసలు విషయానికొస్తే...

పినాకిరావుకు క్రెడిట్ కార్డులంటే ఎప్పట్నుంచో మోజు. తన ఫ్రెండ్సంతా స్టయిల్‌గా పర్సులోంచి క్రెడిట్ కార్డులు తీసి షాపుల్లో, హోటల్స్‌లో ఇస్తుంటే అతనికి జెలసీగా వుండేది. తనెప్పుడు అలా స్టయిల్‌గా క్రెడిట్‌కార్డు తీసి స్త్రాడో అని అనుకుంటూ వుండేవాడు.

దానికితోడు భార్య కూడా మొగుడ్ని సందు దొరికితే చాలు, దెప్పి పొడుస్తూ వుండేది.. "మీరూ వున్నారెం దుకు? ఒక క్రెడిట్ కార్డా.. లేనా?" అంటూ.

అలా పినాకిరావుకు జీవితాశయం ఇల్లు కొనడమో, కారు కొనడమో కాదు, క్రెడిట్ కార్డులు సంపాదించ టమే జీవితాశయం అయింది.

అలా కష్టపడి, కష్టపడీ.. ప్పడీ... పడీ... క్రెడిట్ కార్డులు ఏకంగా మూడు సాధించాడు.

* * *

"మన పక్కింటి మీరాకి ఎంత పొగరు. దానికి 'అయి పోయాగ్రా' బ్యాంకు క్రెడిట్ కార్డు వుందట. ఎదురింటి సువర్ణకి 'ఫినిష్' బ్యాంకు క్రెడిట్ కార్డు వుందిట. ఎంత వగలుపోయేవాళ్లు. ఇక చూడండి... వాళ్ల సంగతి చెప్తా" పళ్లు పటపటలాడిస్తూ అంది మిసెస్ పినాకిరావు.

"నిజమే, మా పక్క సెక్షన్ అరవిందగాడికి క్రెడిట్ కార్డు వుందని పెద్ద గీర. మా బాస్ కర్కోటేశ్వర్రావుకూ అంతే.." పినాకిరావు అన్నాడు.

అలా క్రెడిట్ కార్డు టాపిక్ ఆరోజంతా నడిచింది. తెల్ల వారితే దశమి.. మంచి ముహూర్తం చూసి క్రెడిట్ కార్డు వాడాలని డిసైడయ్యారు.

* * *

పొద్దున్నే..

దర్జాగా సెలూన్‌కి వెళ్లి నున్నగా షేవ్ చేయించుకుని గర్వంగా క్రెడిట్ కార్డు ఇచ్చాడు.

సెలూన్‌వాలా పినాకిరావు వైపు సానుభూతిగా చూసాడు.

"ఏంటోయ్.. కార్డ్.. క్రెడిట్ కార్డు.. టేకిట్ అండ్ గివ్విట్.." అన్నాడు.

"ఇంకా మా సెలూన్‌కి అంత సీన్ లేదు సార్.. మేం క్రెడిట్ కార్డులు యాక్సెప్ట్ చేయం" చెప్పాడు సెలూన్ వాలా.

"అదేంటి, క్రెడిట్ కార్డులు యాక్సెప్ట్ చెయ్యరా. బ్యాడ్.. వెరీ బ్యాడ్. ఇప్పుడెలా? క్రెడిట్ కార్డు వుందని డబ్బులు కూడా తేలేదే"

"హోటల్‌లో పుష్టిగా తిని డబ్బులు కట్టకపోతే పప్పు రుబ్బిస్తారు. మేమైతే ఓ నాలుగు కటింగ్‌లు చేయిస్తాం" జోకాడు సెలూన్‌వాలా.

పినాకిరావు గుర్రుగా చూసాడు. ఆ సెలూన్‌కు అతను రెగ్యులర్ కస్టమర్ కావడంతో డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పి బయటపడ్డాడు.

సెలూన్‌కు రావడం ఏదైనా సింబాలికా? అనుకు న్నాడు నున్నగా వున్న తన షేవ్ వంక చూసుకుంటూ.

తథాస్తు దేవతలు జాలిగా చూసి "దట్సాల్" అనే శారు.

* * *

మిసెస్ పినాకిరావు ఓ బట్టలషాపుకి వెళ్లింది. స్టయి ల్‌గా క్రెడిట్ కార్డుని గాల్లోకి ఎగరేసి క్యాచ్ పట్టుకుంది. బట్టలషాపులో వున్న సేల్స్‌బోయ్ జాలిగా చూసాడు మిసెస్ పినాకిరావువైపు.

వరసగా తనకు నచ్చిన చీరలు సెలెక్ట్ చేసుకుంది.

"మేడమ్.. క్యాషా? క్రెడిట్ కార్డా?" అడిగాడు ఓనర్ చంకలు గుద్దుకుంటూ.

"నో క్యాష్.. ఓన్లీ క్రెడిట్ కార్డు" అంది విలాసంగా క్రెడిట్ కార్డు గిరాటు వేస్తూ.

"ఇక మీ బ్రతుకు ఓన్లీ యాషే (బూడిదే)" అనుకు న్నాడు జాలిగా సేల్స్‌బోయ్.

క్రెడిట్ కార్డును మెషీన్‌లో ఓ గీకు గీకి ఓచర్ మీద సంతకం పెట్టించుకుని "థాంక్యూ మేడమ్" అన్నాడు షాపు ఓనర్.

కనీసం బిల్లు వంక కూడా చూడలేదు. స్టయిల్‌గా క్రెడిట్ కార్డుని హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకుని బయటకు వస్తుంటే తెలిసిన స్నేహితురాలు కనిపించింది.

"హాయ్..." అని ఫ్రెండ్‌ని పలకరించి "యూనో.. షాపింగ్‌కు వచ్చాను. క్రెడిట్ కార్డు.. డబ్బులైతే ఎవడు మోసుకువస్తాడు బోర్... పద అలా కూల్‌డ్రింక్ తాగుదాం. నో ప్రాబ్లెం క్రెడిట్ కార్డు వుంది" అంది తన ఫ్రెండ్‌తో మిసెస్ పినాకిరావు గర్వంగా.

ఆ ఫ్రెండ్ మిసెస్ పినాకిరావు వంక చూసి ఓ నిట్టూర్పు విడిచి.. "ఒకప్పుడు నేనూ నీలా స్టయిల్ ఒలకబోసిందాన్నే. బట్.. నాట్ నౌ.." అని తన పాత చీర వైపు చూసుకుంది. దాని మీనింగ్ మిసెస్ పినాకిరావుకు తెలిసివుంటే మరోలా వుండేది.

* * *

ఆరోజు సాయంత్రమే పినాకిరావు తన భార్యతో కలిసి ఫైవ్‌స్టార్ హోటల్‌కి వెళ్లాడు. ఇష్టమున్నట్టు ఆర్డర్ చేసారు. దర్జాగా క్రెడిట్‌కార్డు ఇచ్చి సంతకం బరాబరా గీకి బయటకు వచ్చారు.

ఆ విధంగా ఎడాపెడా పెడా ఎడా మిస్టర్ అండ్ మిసెస్ పినాకిరావు జాయింట్‌గా క్రెడిట్ కార్డుల్ని వాడ్డం మొదలెట్టారు. కొన్నాళ్ల తర్వాత వాళ్ల బ్రతుకు ఎలా పేస్ట యిందో చూడాల్సిందే!

* * *

పినాకిరావు ఆఫీసుకు వెళ్తున్నాడు. ఎప్పటిలా స్కూటర్ మీద కాదు, దాన్ని స్టోర్ రూమ్‌లోకి నెట్టేసాడు. ఫైనాన్స్‌లో లోన్ మీద కారు కొన్నాడు.

ట్రాఫిక్ సిగ్నల్స్ దాటగానే ఓ కారు వచ్చి, ఇతని కారుకి అడ్డంగా ఆగింది. అందులో నుంచి నాలుగు ధృడమైన శాల్తీలు దిగాయి.

"ఒరే పినాకీ... దిగరా" అన్నాడో శాల్తీ.


పినాకిరావుకు కోపం తన్నుకొచ్చింది. "మర్యాద... ఒరే ఏంటీ? అయినా నేను కారు దిగడం ఏంటి?" ఉక్రో

షంగా అన్నాడు పినాకిరావు.

"ఏరా.. కారు లోన్ ఇన్‌స్టాల్ మెంట్ కట్టావా?"

"లేదు.." మెల్లగా అన్నాడు.

వెంటనే అందులోని ఓ శాల్తీ మిగతా శాల్తీల వైపు చూసి "ఒరే.. వీడు ఇన్‌స్టాల్‌మెంట్ కట్టలేదు(ట్రా" అంటూ పినాకిరావు వైపు చూసి "ఇన్‌స్టాల్‌మెంట్ కట్టకపోతే నీకు మర్యాదేమి(ట్రా... దిగుబే" అన్నాడు.



"మీ... మీ... మీరెవరు?"

"రికవరీ ఏజంట్లం బే..." అన్నాడొకడు. మరొకడు అమాంతం పినాకిరావును ఎత్తి పక్కన కుదేసి కారు తీసుకున్నాడు. పినాకిరావు ఉస్సూరుమంటూ ఇంటికి వచ్చేసరికి భార్య పసుపుతాడు, చిరిగిపోయిన చీరతో కనిపించింది.

"ఇదేమిటే ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషనా?" నీరసంగా అడిగాడు పినాకిరావు భార్యను.

మొగుడివంక గుర్రుగా చూస్తూ "నా బొంద కాంపిటీషన్. ఎవరో రికవరీ ఏజెంట్లంట. అమౌంట్ జమ చేయలేదని మనింట్లోని చీరలూ అవీ తీసుకెళ్లారు. ఈలోగా 'ఇదేదో' బ్యాంకు రికవరీ ఏజెంట్లు వచ్చారు. దున్నపోతుల్లా వున్నారు. నా నగలన్నీ తీసుకుపోయారు. ఈసారి నిన్నే తీసుకువెళ్లి బ్యాంకు ముందు ముష్టెత్తిచ్చి మా డబ్బులు రాబట్టుకుంటామని బెదిరించారు" చెప్పింది మిసెస్ పినాకిరావు.

"నా కారు కూడా తీసుకుపోయారే. ఇక మనకు మిగిలింది ఈ సూట్ ఒక్కటే" తన ఒంటి మీదున్న సఫారీ సూట్ వంక చూసుకుంటూ చెప్పాడు పినాకిరావు.

"ఈలోగా 'అదేదో' బ్యాంక్ రికవరీ ఏజెంట్లు వచ్చారు. "ఆర్యూ మిస్టర్ పినాకిరావు?" అడిగారు వాళ్లు.

"యస్.. " అన్నాడు నీర్సంగా.

"మీరు ఇన్‌స్టాల్‌మెంట్ ఎమౌంట్ పే చేసారా?"

"లేదు.." అన్నాడు పినాకిరావు సిగ్గుతో చితికిపోతూ.

"పోనీ ఇప్పుడు చేస్తారా సార్?" మరింత రెస్పెక్ట్‌గా అడిగారు వాళ్లు.

"హు.. నా దగ్గరేమున్నాయ్" సీలింగ్ వంక చూస్తూ అన్నాడు పినాకిరావు.

"ఇంకా వీడికి రెస్పెక్టేమిటి? కమాన్ వేరీజ్ ద అమౌంట్.. " అన్నాడు రికవరీ ఏజెంట్ పినాకిరావు చొక్కా లాగుతూ... కట్ చేస్తూ పినాకిరావు సూట్ లాక్కుని, వార్నింగిచ్చి వెళ్లారు.

★ ★ ★

పాత ప్యాంటు, చొక్కా వేసుకుని, స్టోర్ రూమ్‌లో నుంచి మొన్నటికి మొన్న విసిరేసిన స్కూటర్‌ని రిపేర్ చేయించుకుని వెళుతుంటే మరో బ్యాంకు వాళ్ల రికవరీ ఏజెంట్‌లు వచ్చి "క్రెడిట్ కార్డు ఎడాపెడా వాడుకుని ఇప్పుడు కట్టవ(ట్రా..." అని స్కూటర్ లాక్కెళ్లారు.

★ ★ ★

ఇప్పుడు పినాకిరావు రోజూ సిటీ బస్సులో ఆఫీసుకు బితుకుబితుకుమంటూ వెళ్లొస్తున్నాడు. అప్పుడప్పుడు రికవరీ ఏజెంట్లు వచ్చి పినాకిరావుని వీరబాదుడు బాది, మిసెస్ పినాకిరావుని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి వెళుతున్నారు.

★ ★ ★

"హేవండీ... క్రెడిట్ కార్డులు, బ్యాంకు లోన్లు లేనప్పుడు ఎంత హాయిగా ఉన్నంతలో జాగ్రత్తగా ఖర్చు పెట్టుకునే వాళ్లం. అప్పులేని మనం మహారాజు మహారాణీల్లా వుండేవాళ్లం. బుద్ధి తక్కువై ఎడాపెడా క్రెడిట్ కార్డు వుందని గోక్కున్నాం. ఇప్పుడు చూడండి, నో మన శ్శాంతి నో హ్యాపీ..." వాపోయింది మిసెస్ పినాకిరావు.

అప్పుడే వచ్చింది మిసెస్ పినాకిరావు ఫ్రెండ్.

"నాదీ సేమ్ పొజిషనే. ఆరోజే చెబుదామనుకున్నా, వినే మూడ్‌లో లేవు. క్రెడిట్ కార్డు అంటే మన మెడ మీద కత్తిలాంటిదే. అయినా తప్పంతా మనదే. అనవసరమైన భేషజాలతో ఇలా అయిపోయేం" అంది.

ఆరోజు మొదలు క్రెడిట్ కార్డు ఎవరి దగ్గర కనిపించినా అరగంటపాటు లెక్చరిస్తూ, తన స్వానుభవాల చిట్టా విప్పుతున్నాడు పినాకిరావు. మీకూ క్రెడిట్ కార్డు వుందా... తస్మాత్ జాగ్రత్త... షార్ప్‌గా వున్న కత్తినీ క్రెడిట్ కార్డునీ జాగ్రత్తగా వాడుకోవాలనే ఫిలాసఫీని చెబుతున్నాడిప్పుడు పినాకిరావు. దట్సాలంతే!

**ముచ్చర్ల రజనీశకుంతల**